
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 27 ఏప్రిల్ 2025



మంత్రి తుమ్మలకు రాహుల్ ఆప్యాయ పలకరింపు

ఖమ్మం ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో శనివారం లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్‌గాంధీ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆప్యాయంగా పలకరించారు. సభావేదిక వద్ద మంత్రి తుమ్మలను చూసి రాహుల్‌గాంధీ ముందుకు పిలిచి పలకరించి కరాచాలనం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిక కన్నా ముందు ఢిల్లీలో రాహుల్‌గాంధీతో తుమ్మల ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతోపాటు పలువురు ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసిన అనుభవంతో పాటు ఆదర్శ రైతుగా ఆయన రైతు జీవితం గురించి అప్పట్లో రాహుల్‌గాంధీ మంత్రి తుమ్మలను అడిగి తెలుసుకున్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామాలయంలో అప్రమత్తం

పహల్గాం ఘటన నేపథ్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

6


కొత్తగూడెం సూపర్‌బజారు సెంటరులో మానవహారం

పాకిస్థాన్‌పై యుద్ధం చేయాల్సిందే..

కొత్తగూడెంలో భారీ నిరసన ప్రదర్శన, మానవహారం

'యూటీఎఫ్' రాఘవయ్య కన్నుమూత

- ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుకైన పాత్ర
- విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి
- తెలంగాణ సాయుధ పోరాటంలోనూ భాగస్వామ్యం
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపకుడు రావెళ్ల రాఘవయ్య(91) అనారోగ్య సమస్యలతో శుక్రవారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం రాత్రి ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని నివాసానికి తీసుకొచ్చారు. రాఘవయ్య మరణం యూటీఎఫ్‌తో పాటు ప్రజాతంత్ర ఉద్యమాలకు తీవ్ర నష్టమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సంతాపం వ్యక్తంచేసింది. రాఘవయ్య సతీమణి సరస్వతి పదేళ్ల క్రితమే కన్నుమూశారు. రాఘవయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. రాఘవయ్య కుమారుల్లో పెద్ద కుమారుడు రమణ విజయవాడలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు ఖమ్మంలో ఉంటున్నారు. కుమార్తెలు కరుణ, అరుణ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరయ్యారు. వారిలో కరుణ ఖమ్మంలో ఉంటుండగా, అరుణ అమెరికాలో స్థిరపడ్డారు.

రాఘవయ్య విజయవాడలోని కుమారుడి వద్దకు వెళ్లిన సమయంలో అస్వస్థతకు గురికాగా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. రాఘవయ్య స్వస్థలం ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామం కాగా, ఖమ్మం నగరంలోని శ్రీనివాసనగర్‌లో (మిగతా 6వ పేజీలో)

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి..

రూ.26 లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ మహిళా టీచర్

6

బీఆర్ఎస్‌లో రజతోత్సవ కళ

ఖమ్మం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ఉమ్మడిజిల్లా నుంచి బస్సులు, కార్లతో పాటు బైక్‌లపై కూడా కేడర్ తరలేందుకు సిద్ధమైంది. గత వారంరోజులుగా జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, రెండు జిల్లాల బీఆర్ఎస్ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు సభకు జనసమీకరణపై దృష్టిపెట్టారు.


సత్తుపల్లిలో ద్విచక్రవాహనాల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

- గులాబీ దళమంతా నేడు వరంగల్ బాట
- ఉమ్మడి జిల్లానుంచి పెద్ద ఎత్తున తరలనున్న శ్రేణులు
- గ్రామస్థాయిలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలకు సిద్ధం

జన సమీకరణపై దృష్టి

వరంగల్ జిల్లాకు సరిహద్దున ఉన్నందున ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే జనసమీకరణ అధికంగా ఉండాలని బీఆర్ఎస్ అధినాయకత్వం ఆదేశించింది. దీంతో ఆయా నియోజకవర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి జనసమీకరణకు అవసరమైన వాహనాలు ఏర్పాటుచేశారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత మొదటిసారి కేసీఆర్ బహిరంగసభకు హాజరవుతుండగా పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లయిన సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నారు. ఓటమి గాయం నుంచి కోలుకుంటున్న నాయకులు, కార్యకర్తలను ఈ సభ ద్వారా స్థానిక ఎన్నికలకు సన్నద్ధం చేసే అవకాశం ఉంది. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లయినా జిల్లాలో ఆది నుంచి బీఆర్ఎస్‌కు వ్యతిరేక ఫలితాలే వస్తున్నాయి.

2018, 2023లో కేవలం ఒక్కొక్క స్థానం మాత్రమే గెలిచింది. 2014 ఎన్నికల్లో అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాలేదు. రాష్ట్ర అవతరణకు ముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్‌కు కేడర్‌లేని పరిస్థితి ఉండేది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టీడీపీ శ్రేణులు టీఆర్ఎస్‌లోకి రావడం, ఆనాడు టీడీపీలో ఉన్న ప్రస్తుత (మిగతా 6వ పేజీలో)



కొత్త రేషన్‌కార్డులకు సన్నబియ్యం

- మే నెల నుంచి అమలు
- 1017 కార్డులు... 40,519 మంది లబ్ధిదారులు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకాన్ని మే నెల నుంచి కొత్త రేషన్ కార్డుదారులకు అందించనున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. జిల్లాలో కొత్తగా 1017కార్డులు వచ్చాయని వీటిలో 40,519 మంది లబ్ధిదారులున్నారని వీరి కోసం ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున ఈ నెలలో 2,43,114 కిలోల బియ్యాన్ని అందించ నున్నట్లు తెలిపారు. వీరితో కలుపుకొని మే నెలలో జిల్లాలో అన్ని రేషన్ దుకాణాలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3లక్షల 84,734 కార్డు దారులకు 11,10,762 మంది లబ్ధిదారులకు 66,64,572 కిలోల బియ్యాన్ని (మిగతా 6వ పేజీలో)

'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు
- నగరంలో శాంతి ప్రదర్శన



శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న రాజకీయపార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గత నాలుగురోజులుగా కర్రెగుట్టల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో కేంద్ర పారామిలటరీ బలగాలు, వివిధ రాష్ట్రాల బలగాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని ప్రముఖ విద్యావేత్త రవిమారుత్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌నుంచి పాతబస్టాండ్ వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు.

ఈ సందర్భంగా రవిమారుత్, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... దేశపౌరులపై యుద్ధం చేయడం ప్రపంచంలో ఎక్కడాలేదని, దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన సైనికులు దండకారణ్యంలో ఆదివాసీలపై యుద్ధం చేయడం అప్రజాస్వామికమన్నారు. మరోపక్క ప్రభుత్వంతో శాంతిచర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే మావోయిస్టులు ప్రకటించినప్పటికీ ప్రభుత్వం వైపు నుంచి సానుకూల స్పందన రాకపోవడం వెనుక, కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలు ఉన్నాయన్నారు. దేశ సంపదను కాపాడుకోవడం కోసం ఆదివాసీలకు మద్దతుగా ప్రతీ ఒక్కరు ముందుకుగా రావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ పాటించి వెంటనే శాంతి చర్చలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, యర్రా శ్రీనివాస్ సీపీఐ జిల్లా నాయకులు సింగు నర్సింహారావు, పోటు కళావతి, శివరామకృష్ణ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి మధు, జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్, ఆప్ జిల్లా కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు బీఎస్పీ జిల్లా కార్యదర్శి నాగరాజు, తెలంగాణ పీపుల్ జేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, జర్నలిస్టు చిర్రా రవి, కె.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ నాయకులు బాబురావు, జిల్లా విద్యావంతుల వేదిక జిల్లా నాయకులు అజిత్‌పాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు..

- బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ నిర్వీర్యం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లేరు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్



ఖమ్మంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా విద్యార్థులు, యువత ఉపేక్షించేది లేదని, పహల్గాంలో జరిగిన దారుణ సంఘటన తీవ్రంగా కలిచివేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం గిరిప్రసాద్ భవన్‌లో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అధిక సంఖ్యలో విద్యార్థులు బలిదానాలు చేశారని, కానీ అధికారం లోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యాశక్తులకు ఊతం ఇచ్చింద న్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదిన్నర కాలంలో కనీసం విద్యాశాఖ మంత్రిని పెట్టలేదని, సీఎం వద్ద విద్యాశాఖ ఉన్నా.. ఒక్క రివ్యూ సమావేశం నిర్వహించలేదన్నారు. మొదటి బడ్జెట్ సమావేశంలో 7 శాతం, రెండో బడ్జెట్ సమావేశంలో 7.5 శాతం నిధులు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. మేనిఫెస్టో మేరకు బడ్జెట్ కేటాయింపులు జరపలేదన్నారు. జేఈఈ మెయిన్ పరీక్షల్లో ఇతర రాష్ట్రాల్లో వచ్చిన ర్యాంకులను కూడా తెలంగాణలోని కార్పొరేట్ శక్తులు ప్రకటించుకుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో 40 ఏళ్లుగా ప్రభుత్వ యూనివర్సిటీ డిమాండ్ ఉందని, ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఎందుకు ప్రభుత్వ యూనివర్సిటీ తెప్పించలేక పోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ సరిహద్దు మిలటరీలో బీజేపీ ప్రభుత్వం రెగ్యూలర్ జవాన్ల నియామకం చేపట్టడం లేదని, అగ్నిపథ్ వంటి నిర్ణయాలు మానుకొని కేంద్ర రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎండీ అన్వర్, మాగం లోకేష్, నాగుల్‌మీరా, మధు, శివనాయక్, మనోజ్, గోపి, ప్రతాప్, రాకేష్, గణేష్, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఎదురుగడ్డలో ఏసీబీ కలకలం

కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ హరిరాం ఇల్లు, బంధువుల ఇళ్లల్లో సోదాలు


హరిరాం బంధువుల ఇళ్లలో సోదాలు

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరాంపై శనివారం ఏసీబీ అధికారులు దాడులు చేపట్టగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డలో ఆయన ఇంటిలో, అయన బంధువుల ఇళ్లలో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. హరిరాం స్వస్థలం కొత్తగూడెంలోని ఎదురుగడ్డ. అక్కడ ఆయనకు ఇల్లు ఉంది. ఆయనపై హైదరాబాద్‌లో ఏసీబీ దాడులు కొనసాగుతున్న క్రమంలో ఎదురుగడ్డలో ఆయన నివాసం, బంధువుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించినట్టు ఏసీబీ డీఎస్పీ రమేష్ వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో హరిరాంతో పాటు ఆయన బంధువుల ఇళ్లపై మొత్తం 15 చోట్ల దాడులు నిర్వహించినట్లు తెలిపారు. శనివారం ఎదురుగడ్డ ప్రాంతంలో ఉదయం 5:30 గంటల నుంచి సాయంత్రం వరకు సోదాలు జరిపినట్టు తెలిపారు.

సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించాలి

- ఆచరణ కోసం అధ్యయనం చేయాలి
- తరగతి గదిని సమాజంతో అనుసంధానించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఐదో మహాసభల్లో ప్రొఫెసర్ నాగేశ్వర్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కేవలం విద్యా సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా సమాజంలో సైద్ధాంతిక భావజాలాన్ని పెంపొందించటానికి కృషి చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ తెలిపారు. విద్యాపరమైన అసమానతలే ఆదాయ అసమానతలకు దారి తీస్తాయని, వర్గ చైతన్యం దిశగా ఎస్ఎఫ్ఐ పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఖమ్మం నగరంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఐదో మహాసభల సందర్భంగా శనివారం ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభలో నాగేశ్వర్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. ధనిక, పేద అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఏ సిద్ధాంతమైనా ఆచరణ నుంచి రావాలన్నారు. ఆచరణ కోసమే అధ్యయనం చేయాలని సూచించారు. ఆలోచనలు, పోరాటంలో ఎస్ఎఫ్ఐ ముందుండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల దైనందిన సమస్యలను ప్రాపంచిక దృక్పథంతో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. అందుకు తరగతి గదిని సమాజంతో అనుసంధానం చేయాలని సూచించారు. నేటి ప్రజా ఉద్యమాలకు కీలకమైన నాయకులను అందించిన ఘనత ఎస్ఎఫ్ఐకి ఉందన్నారు.

దేశ ఐక్యతకు ఎస్ఎఫ్ఐ వేలాది మంది ప్రాణాలను పణంగా పెట్టిందన్నారు. ప్రభుత్వ విద్యావిధానం గతంలో బలంగా ఉండేదని, నాటి భిన్నత్వమే సామాజిక చైతన్యానికి కారణమై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. అందుకే ధనిక, పేద అంతరాలను దాటి విద్యార్థి ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాలు 400శాతం పెరిగితే ఉద్యోగుల వేతనాలు 5శాతం పెరిగాయన్నారు. దేశంలో పది శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం రూ.1.45 లక్షల కోట్ల రాయితీలు అందిస్తోందన్నారు. అందువల్లనే విద్య, వైద్యం, సామాజిక రంగాలకు నిధుల కొరత ఏర్పడుతోందన్నారు. పహల్గాం ఉగ్రదాడిని బీజేపీ సోషల్ మీడియా ముస్లిం దాడులుగా ప్రేరేపిస్తోందని ఆరోపించారు. హార్స్ రైడర్ సయ్యద్ హుస్సేన్ పర్యాటకులను కాపాడిన విషయాన్ని సమాజం గుర్తుంచుకోవాలన్నారు.

మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం పేరుతో 300 ప్రభుత్వ పాఠశాలలు మూసివేసే కుట్ర జరుగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 11 జిల్లాల్లో ఆదివాసీలు సరైన విద్యకు నోచుకోవటం లేదన్నారు. 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలుండగా వారిలో తెలుగు భాష వచ్చిన వారి సంఖ్య తక్కువగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాలల పేరుతో హిందీ వచ్చిన వారిని నియామకం చేశారని ఆరోపించారు. ములుగు గిరిజన విశ్వవిద్యాలయం బోర్డులకే పరిమితమైందన్నారు. భద్రాచలం ప్రభుత్వ బీఈడీ కాలేజీలో సరైన ఉపాధ్యాయులు లేరన్నారు. సభలో సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు, ఆహ్వాన సంఘం చైర్మన్ మువ్వా క్రాంతి శ్రీనివాసరావు ప్రసంగించారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ముగిసిన జీఎస్టీ సమగ్ర అవగాహన సదస్సు



టాక్స్ ఫెడరేషన్ సౌత్‌జోన్ ప్రెసిడెంట్ ఎంవీజే కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం చర్చికాంపౌండ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో వివిధ ప్రాంతాల్లో భూములు కబ్జాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. శనివారం ఖమ్మంలోని ఆప్ కార్యాలయంలో జరిగిన ఈస్ట్‌జోన్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖమ్మం పట్టణంలోని భూగర్భజలాలకు ఆయువు పట్టు లాంటి లకారం చెరువును ఆక్రమించడంతో ఖమ్మం పట్టణంలో భూగర్భజలాలు వేసవిలో తగ్గి నీటి ఎద్దడి ఏర్పడుతోందన్నారు. లకారం చెరువు కబ్జాకు గురికావడంతో గతేడాది వచ్చిన వరదలకు పట్టణంలోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయన్నారు. ఖమ్మం పట్టణంలో కబ్జాలను ఖాళీ చేయించేందుకు కలిసివచ్చే పార్టీలతో కలిసి ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు, శిర్పా కిరణ్‌కుమార్, గోళ్ల రామకృష్ణ, పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా మహిళల ఉత్పత్తులకు
భారత్ సమ్మిట్‌లో విశేష ఆదరణ

- కలెక్టర్ ఆలోచనతో శిల్పారామంలో ప్రత్యేక స్టాల్



స్టాల్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశానుసారం 2025 ఏప్రిల్ 26న హైదరాబాద్ శిల్పారామంలో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో జిల్లా మహిళల ఉత్పత్తులకు ప్రత్యేకంగా ఓ స్టాల్స్ ఏర్పాటుచేశారు. గతంలో కలెక్టర్ ఆలోచన మేరకు మార్చి 9న హైదరాబాద్ మాదాపూర్‌లోని నాలెడ్జి సిటీలో నిర్వహించిన 'రన్ ఫర్ హర్' కార్యక్రమంలో కూడా జిల్లా మహిళలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ అనుభవంతో మరింత ప్రేరణ పొందిన మహిళలు, ఇప్పుడు భారత్ సమ్మిట్‌లో మరింత విస్తృతస్థాయిలో తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఏ నుంచి, మహిళా సమాఖ్యలకు చెందిన మహిళలు హాజరై ఇల్లెందు పిండి వంటలు ప్రదర్శన చేశారు. అదేవిధంగా వెదురు, సిమెంట్‌తో తయారు చేసిన సంప్రదాయ గదులు, కోయ కల్చరల్ ఆర్ట్స్ అండ్ ఫుడ్ క్రాఫ్ట్స్ (జీసీసీ) ఐటీడీఏ వారు తయారు చేసిన వివిధ ఉత్పత్తులు కూడా ఈ స్టాల్‌లో ప్రదర్శించబడ్డాయి. కలెక్టర్ సొంత ఆలోచన మేరకు వ్యాయామానికి ఉపయోగించే విధంగా వెదురు, సిమెంట్ మిశ్రమంతో రూపొందించిన ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. వినూత్నంగా రూపొందించిన ఈ దృశ్యం సందర్శకులను విశేషంగా ఆకర్షించింది. శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌కు మంచి స్పందన లభించినట్లు డీఆర్‌డీఏ డీపీఎం నాగజ్యోతి తెలిపారు. మహిళలు, గదల తయారీదారుడు కృష్ణమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొని ఉత్పత్తుల ప్రదర్శన ద్వారా భద్రాద్రి ప్రతిష్ఠను మరింత పెంచారు.

త్వరలో బ్రిడ్జికి మరమ్మతులు

పెద్దవాగు బ్రిడ్జిని పరిశీలించిన జిల్లా మైనింగ్ డీఈ దినేష్



బ్రిడ్జిని పరిశీలిస్తున్న మైనింగ్ డీఈ దినేష్

కరకగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే పెద్దవాగు బ్రిడ్జి మరమ్మతులు చేపట్టనున్నట్టు జిల్లా మైనింగ్ డీఈ, మండల ప్రత్యేక అధికారి దినేష్ తెలిపారు. శనివారం ఆయన అధికారులతో కలిసి పెద్దవాగు బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే పెద్దవాగు వద్ద ఫ్లోరింగ్ ప్లాట్ ఫామ్, కోతకు గురి కాకుండా చెట్లను పెంచనున్నట్టు తెలిపారు. ఇక్కడి పరిస్థితిని కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్టు తెలిపారు. అనంతరం కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఆయన అక్కడ పరిస్థితులను వైద్యాధికారి రవితేజను అడిగి తెలుసుకున్నారు. రోజువారి ఓపీ, మందులు, వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్, ఎంపీవో మారుతి, కార్యదర్శి కృష్ణ, ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశం సుభిక్షంగా ఉండాలని..

- రామాలయంలో శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణం



పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో హిందువులపై దాడిని నిరసిస్తూ దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం 'శ్రీరామ రక్షా స్తోత్ర' పారాయణం నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం తరఫున స్థానాచార్యులు కేఈ స్థలశాయి ఆధ్వర్యంలో దేవస్థానం వైదిక, పరిపాలన సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు పాల్గొని శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణం నిర్వహించారు. అదేవిధంగా ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించగా.. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది గోపాలాచార్యులు, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు, వేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ, లింగాల రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వేసవిలో భక్తులకు ఉపశమన చర్యలు



ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో భద్రాద్రి రామాలయాన్ని సందర్శించే భక్తులకు, ఉచిత నిత్యాన్నదాన పథకంలో స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించడానికి వచ్చే భక్తులకు దేవస్థానం అధికారులు ఉపశమన చర్యలు చేపట్టారు. ఆలయం నుంచి అన్నదాన సత్రం వరకు కొబ్బరిపీచుతో ఉన్న మ్యాట్లను ఏర్పాటు చేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా టాక్స్ ఫెడరేషన్, జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీలో జీఎస్టీ చట్టంలోని అంశాలతోపాటు ఇన్‌కం టాక్స్‌లో మారుతున్న విధానాలపై జరుగుతున్న సమగ్ర అవగాహన సదస్సు శనివారం ముగిసింది. నగరంలో గత ఆరు రోజులుగా జరిగిన ఈ సదస్సులో టాక్స్ చెల్లింపులు, బేసిక్స్, డెబిట్ నోట్, క్రెడిట్ నోట్, రిటర్న్ ఫైలింగ్, ఇన్‌కం టాక్స్ చెల్లింపుదారులకు ఉన్న సందేహాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా టాక్స్ ఫెడరేషన్ సౌత్‌జోన్ ప్రెసిడెంట్ ఎంవీజే. కుమార్, ఉపాధ్యక్షుడు నగేష్‌రంగీ, మాజీ చైర్మన్ నాగేంద్రప్రసాద్, జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు, సెక్రెటరీ పవన్‌కుమార్, కోటా సునీల్, కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు ఊరెళ్తున్నారా.. జరభద్రం

- దూర ప్రయాణాలు చేసే వారు పోలీసులకు సమాచారమివ్వాలి : ఎస్పీ



భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ప్రారంభం కావడంతో చాలామంది ప్రయాణాలు చేస్తారు. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. వేసవి సెలవుల దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత స్టేషన్ అధికారులకు తెలపాలని, రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇళ్ల పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇంట్లో లేని సమయంలో ఇంటిని గమనిస్తూ ఉండమని నమ్మకమైన ఇరుగుపొరుగు వారికి చెప్పడం మంచిదన్నారు. ఇంట్లో ఉన్న బంగారం, నగదును బ్యాంకులో భద్రపర్చుకోవాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభమన్నారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లకు ప్రశంసా పత్రాలు

భద్రాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలింపును అరికట్టిన ఎస్ఐలకు, హెడ్‌కానిస్టేబుళ్లకు రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో భద్రాచలం ఎస్ఐగా ఇదివరకు బాధ్యతలు నిర్వహించిన విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్ఐలుగా బాధ్యతలు నిర్వహించిన మధు, ప్రసాద్, హెడ్ కనిస్టేబుళ్లు భాస్కరరావు, సురేంద్రబాబులకు డీజీపీ ప్రశంసా పత్రాలను అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక మహిళా పోలీసు అధికారిని విజయలక్ష్మికి మాత్రమే ప్రశంసా పత్రం అందజేయటం విశేషం.

భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ గా తిరుపతి

భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐగా తిరుపతిని నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అశ్వాపురం ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న తిరుపతి భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐగా వస్తుండగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన మధు ప్రసాద్ అశ్వాపురానికి ఎస్ఐగా బదిలీ అయ్యారు.

సీఎం తినే బియ్యమే ప్రజలు తింటున్నారు

- జై భీమ్ జై సంవిధాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ అనిల్ కుమార్



మాట్లాడుతున్న అనిల్ కుమార్

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తినే బియ్యమే అన్ని వర్గాల ప్రజలు తినాలనే సంకల్పంతో రేషన్ షాప్‌ల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని జైబాపు.. జై భీమ్.. జై సంవిధాన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.అనిల్ కుమార్ తెలిపారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాలో శనివారం రాత్రి జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల పార్టీ అని, అభివృద్ధి చేయడమే పార్టీ ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపి పార్టీలు ఒక్కటేనని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలను విడతల వారీగా అమలు చేస్తుందన్నారు. దేశ ప్రజలకు న్యాయం చేయాలనే సంకల్పంతోనే జై బాపు..జైభీమ్..జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల జరిగిన కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల కో ఆర్డినేటర్‌లు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.



మధిరలో బీఆర్ఎస్ ప్రదర్శన

బీఆర్ఎస్‌లో రజతోత్సవ కళ

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు టీఆర్ఎస్‌లో చేరడంతో ఒక్కసారిగా గులాబీ జిల్లాగా మారింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కూడా టీఆర్ఎస్‌లో చేరడంతో మరింత బలం పెంచుకుంది. కానీ ఆ తర్వాత తుమ్మల, పొంగులేటి గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి జిల్లాలో కోలుకోని దెబ్బ తగిలింది.

వారిపైనే ఆధారం..

ఉమ్మడి జిల్లా నుంచి ప్రస్తుతం ఆ పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వనమా వెంకటేశ్వరరావులు కూడా కాంగ్రెస్ నుంచే బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వీరంతా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. సంస్థాగతంగా ఓటుబ్యాంకు పరంగా దెబ్బతిన్న బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కసీటు మాత్రమే గెలవగా లోక్‌సభ ఎన్నికల్లో దారుణంగా ఓటమి చెందింది. ఈ నేపథ్యంలో వరంగల్ రజతోత్సవ సభ ద్వారా మళ్లీ సంస్థాగతంగా బలపడేందుకు సిద్ధమవుతోంది. ఆదివారం జరిగే సభ నేపథ్యంలో పంచాయతీలు, మునిసిపల్ పట్టణాల్లో బీఆర్ఎస్ జెండాలు ఆవిష్కరించి పార్టీ శ్రేణులు సభకు బయలుదేరనున్నాయి. ఆయా నియోజకవర్గాలలో ఎవరికి వారు వాహనాలు సిద్ధం చేసుకున్నారు.

కొత్త రేషన్‌కార్డులకు సన్నబియ్యం

(5వ పేజీ తరువాయి)

అందించనున్నట్టు తెలిపారు. వీటితో పాటు అంత్యోదయ కార్డుదారులు 27,253 ఉండగా 78,918 మంది లబ్ధిదారులున్నారు. వీరి కోసం 9,53,855 కిలోలు అందించనున్నట్టు చెప్పారు. అన్నపూర్ణ కార్డులు మూడింటికి గాను 5గురు లబ్ధిదారులున్నారు. వీరికి 30 కేజీలు, పూర్తిగా ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. అంత్యోదయ కార్డుదారులకు పంచదారను ఒక కిలో చొప్పున రూ.13.50కి అందించనున్నట్లు డీఎస్వో తెలిపారు. మే 1 నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు. బయోమెట్రిక్ విధానంలో లబ్ధిదారులు తీసుకుని డీలర్‌నుంచి తక్షణమే రశీదు పొందాలని ఆయన సూచించారు.

పాకిస్థాన్‌పై యుద్ధం చేయాల్సిందే..

- భారత్‌లో దేశ ద్రోహులను గుర్తించి పారదోలాలి
- వివిధ సంఘాల బాధ్యుల డిమాండ్
- కొత్తగూడెంలో భారీ నిరసన ప్రదర్శన, మానవహారం



కొత్తగూడెంలో భారీ నిరసన ర్యాలీ

కొత్తగూడెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సరైన సమాధానం పాకిస్థాన్‌పై యుద్ధం చేయడమేనని కొత్తగూడెంలో హిందూ సంఘాలు ముక్తకంఠంతో నినదించాయి. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం కొత్తగూడెంలో వివిధ వ్యాపార సంస్థలు, హిందూ సంఘాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన, మానవహారాన్ని నిర్వహించారు. ఉదయం 9 గంటలకు కొత్తగూడెం ఓల్డ్ బస్సు డిపో నుంచి వేలాది సంఖ్యలో నిరసనకారులు జాతీయ జెండాలను చేతపట్టి భారత్ మాతాకీ జై అంటూ ర్యాలీలో పాల్గొన్నారు. దారి పొడవున ఖబర్దార్ పాకిస్థాన్ ఉగ్రవాదులారా అంటూ పాకిస్థాన్‌తో యుద్ధం.. మేము సైతం సిద్ధం అంటూ హోరెత్తించారు. పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్‌లో మానవహారాన్ని నిర్వహించి ఐక్యతను ప్రదర్శించారు. అక్కడి నుంచి బస్టాండ్ సెంటరు మీదుగా పోస్టాఫీస్ సెంటరుకు చేరుకుని హిందువులపై దాడిని ఖండిస్తూ ఉగ్రమూకను అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి ప్రజలంతా మద్దతుగా ఉంటారని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శాంతియుతంగా ఉన్న భారతదేశంలో కొందరు పాకిస్థాన్ తొత్తులుగా వ్యవహరిస్తూ ఉగ్రవాదులకు సహకరిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అటువంటి వారిని గుర్తించి దేశద్రోహులను పారదోలాలని విజ్ఞప్తి చేశారు. మతాలకతీతంగా మనుగడ సాగిస్తున్న ఈ దేశంలో చిచ్చుపెట్టేందుకు పాకిస్థాన్ ముష్కరులు ప్రయత్నిస్తున్నారని, దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడాన్ని తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్, భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్, శివాజీ మహరాజ్ సేన, హనుమాన్ సేవా సమితి, వివిధ కార్మిక సంఘాలు, వివిధ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

'యూటీఎఫ్' రాఘవయ్య కన్నుమూత



రాఘవయ్య మృతదేహం



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



సంతాప సభలో మాట్లాడుతున్న పోతినేని

(5వ పేజీ తరువాయి)

స్థిరపడ్డారు. 1951లో ఖమ్మం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1986లో ఖమ్మంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో రిటైరయ్యారు. ఆయన దమ్మపేట, ముదిగొండ, బూర్గంపాడు, ఖమ్మం పాఠశాలల్లో పనిచేశారు. ఆ సమయంలోనే 1974లో యూటీఎఫ్‌ను స్థాపించారు. 1975లో వ్యవస్థాపక కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రముఖంగా పాల్గొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. విద్యా అభివృద్ధికి కృషి చేశారు. శ్రీనివాసనగర్‌లో గ్రంథాలయాన్ని నిర్మించి ప్రజలకు విశేష సేవలు అందించారు. యూటీఎఫ్ భవన నిర్మాణానికి కృషి చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని కాల్వొడ్డులోని హిందూ శ్మశాన వాటికలో రాఘవయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సంతాప సభ

శ్రీనివాసనగర్‌లో శనివారం రాఘవయ్య సంతాపసభ నిర్వహించారు. ఈ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు తదితరులు హాజరై నివాళులు అర్పించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, శేఖర్, వీరబాబు, జేవీవీ నాయకులు, బీవీకే ట్రస్టు సభ్యులు రాఘవయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

భద్రాద్రి రామాలయంలో అప్రమత్తం

- పహల్గాం ఘటన నేపథ్యంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

భద్రాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన దేవస్థానాల భద్రతపై స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం దేవస్థానాల్లో భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సంబంధిత ఎస్‌పీఎఫ్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శనివారం డాగ్ స్క్వాడ్ తనిఖీల స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. అలాగే ఆలయంలోకి వచ్చే భక్తులను విస్తృతంగా తనిఖీ చేశారు. భద్రాద్రి దేవస్థానంలో రెండు దశాబ్దాలుగా ఎస్‌పీఎఫ్ భద్రత కొనసాగుతోంది. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లతో ఇక్కడ భద్రత వ్యవస్థను నిరంతరం కొనసాగిస్తున్నారు. అత్యవసర వేళల్లో అదనపు ఎస్‌పీఎఫ్ సిబ్బందిని నియమించి భద్రతను మరింత పెంచుతున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయంలో భద్రతపై ఎస్‌పీఎఫ్ సిబ్బంది తమదైన శైలిలో దృష్టి నిలిపారు.

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి..

- రూ.26 లక్షలు పోగొట్టుకున్న రిటైర్డ్ మహిళా టీచర్



ఖమ్మం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థులు బెదిరించటంతో ఓ రిటైర్డ్ మహిళా టీచర్ నగదు పోగుట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం నగరంలోని వేణుగోపాల్‌నగర్‌లో నివాసముండే ఓ రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేశారు. ఎమీ ఫోన్ నుంచి అసభ్యకరమైన మెసేజ్‌లు వెళ్తున్నాయి.. దీనిపై కేసు నమోదవుతుంది.' అని బెదిరించారు. అంతేకాకుండా నకిలీ ఎఫ్ఐఆర్ కాపీలు పంపించి అరెస్ట్ చేస్తామని బెదిరించారు. దీంతో భయపడ్డ సదరు మహిళ ఈ నెల 4నుంచి 16వ తేదీ వరకు సైబర్ నేరగాళ్ల డిమాండ్‌తో సుమారు రూ.26లక్షలు వారి అకౌంట్‌కు పంపించింది. కొద్ది రోజుల తర్వాత ఆమె మోసపోయినట్లు గ్రహించి నగరంలోని సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షలు మళ్లీ వాయిదా

- వారం రోజుల్లో రెండుసార్లు పోస్ట్‌పోన్

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 26, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మళ్లీ వాయిదా పడ్డాయి. వారం రోజుల్లోనే వాయిదా పడడం ఇది రెండోసారి. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీంతో 1.70 లక్షల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి మొదట ఏప్రిల్ 21 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పరీక్షల ఫీజులను చెల్లించకపోవడంతో వాయిదా వేశారు. తర్వాత ఏప్రిల్ 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారు. తీరా పరీక్షల తేదీ దగ్గర పడగా మళ్లీ రెండో దఫా వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు భేటీకి ప్రయత్నించాయి. అయితే రాష్ట్ర ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో వీసీ సమావేశం ఉండడంతో ఆయన వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం వరకు కూడా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదు. మరోవైపు ఆదివారం సెలవు.. తెల్లవారితే సోమవారమే పరీక్షలు ఉండడంతో పరీక్షల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలలోని విద్యార్థులు టెన్షన్‌గా ఎదురుచూశారు. కాగా పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం. తిరుమలదేవి, వెంకయ్య ప్రకటించారు.

‘హరిత’నారీశ్వరుడు



అడవుల్లో విత్తనాలు చల్లుతున్న సాంబయ్య, సీత

- పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న సాంబయ్య
- భర్తకు సహకారం అందిస్తున్న సీత

ఏన్కూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరుకు చెందిన వన ప్రేమికుడు కొంటు సాంబయ్య వనాలను పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. భర్త ప్రవృత్తిని అర్థం చేసుకున్న భార్య సీత సహకారం అందిస్తున్నారు. కొన్నేళ్లనుండి రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో సాంబయ్య మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. వేసవిలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికి తిరిగి చింత, వేప, గిన్నె, చీమ చింత విత్తనాలతో పాటు రకరకాల విత్తనాలుసేకరిస్తున్నారు. ఇలా సేకరించిన విత్తనాలను వర్షాకాలంలో తన ద్విచక్రవాహనంపై భార్య సీతతో కలిసి కేసుపల్లి, బురదరాఘవాపురం, హిమామ్ నగర్, ఇల్లెందు గుట్టల్లో చల్లుతూ వనాల పెంపునకు కృషి చేస్తున్నారు. అతను నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. వేసవిలో పక్షుల కోసం ప్రత్యేకంగా నీటితొట్లను ఏర్పాటుచేసి దాహార్తిని తీరుస్తున్నాడు. ఈఏడాది పర్యావరణ పరిరక్షణకు మరో వినూత్న కార్యక్రమం చేపట్టారు. వీపునకు ఆక్సీజన్ సిలిండర్, వృక్షోరక్షతి...రక్షితం.. నినాదం రాసిన బోర్డును మెడలో వేసుకుని ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. పెళ్లిళ్ల, జాతర రైల్వేస్టేషన్, బస్టాండ్లలో తిరుగుతూ అవగాహన కలిపిస్తున్నారు. వృక్షజాతిని సంరక్షించుకుంటే రాబోయే తరాలు సిలిండర్ వీపునకు తగిలించుకునే పరిస్థితి దాపురిస్తుందని వివరిస్తున్నారు. తాజాగా బుధవారం ఇల్లెందుపట్టణంలోని ఓ ఆరోగ్యం కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న సాంబయ్యను ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేకంగా అభినందించారు. సేవలను కొనియాడారు. సేవలకు గుర్తింపుగా 2019 లో దళిత సాహిత్య అకాడమి, అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ పురస్కారం, 2020లో నేషనల్ ఐకాన్ అవార్డు అందుకున్నాడు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ , మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, లావుడ్యారాములు నాయక్ శాలువాలతో సన్మానించారు. సాంబయ్యను మండల ప్రజలు అభినందిస్తున్నారు.



విత్తనాలు సేకరిస్తూ...



మొక్కను నాటుతూ..

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీవారిని పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని తిప్పికొట్టేందుకు రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతిచేకూరేలా నివాళులర్పిస్తూ శనివారం సత్తుపల్లిలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కశ్మీర్‌లో ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాక్ కుట్రలను తిప్పికొడుతూ భారత ప్రదాని నరేంద్రమోదీ ఏ నిర్ణయం తీసుకున్నా ముక్తకంఠంతో మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

‘మమత’లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

- హాజరైన మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, దీనిని స్వీకరించి భవిష్యత్తులో నిరుపేదలకు సేవాభావంతో పనిచేయాలని కాళోజీ నారాయణరావు వైద్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పీవీ నందన్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఖమ్మంలో మమత వైద్య,దంత,నర్సింగ్ కళాశాలల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. .ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వైద్యరంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికతను పుణికిపుచ్చుకుని మంచి వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి పువ్వాడ మాట్లాడుతూ మమత వైద్య సంస్థలు స్థాపించి ఎంతో మందిని డాక్టర్లను చేయడం గర్వకారణంగా ఉందని అన్నారు. ఈ సందర్భగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పువ్వాడ ఉదయ్ కుమార్, జయశ్రీ కుమారుడు నరేన్ రాజ్ వైస్ చాన్సలర్ చేతుల మీదుగా గ్రాడ్యుయేట్ పట్టా అందుకున్నారు. ఈ గ్రాడ్యుయేషన్ డే లో 360 మంది వైద్య విద్యార్థులు 190 మంది దంత విద్యార్థులు, 100 మంది నర్సింగ్ విద్యార్థులు గ్రాడ్యుయేట్ పట్టాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మమత ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పువ్వాడ నాగేశ్వరరావు, సెక్రటరీ పువ్వాడ జయశ్రీ, డైరెక్టర్లు పువ్వాడ నయన్ రాజ్,నరేన్ రాజ్, ప్రిన్సిపాల్స్ అనురాధ, వెంకటేశ్వర రావు, కృష్ణ వైష్ణవి పాల్గొన్నారు.



పట్టా అందజేస్తున్న వీసీ

హరిబాబుకు గౌరవ డాక్టరేట్

ప్రదానం చేసిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న సేవలను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ తాళ్లూరి హరిబాబుకు గౌరవ డాక్టరేట్‌ను శనివారం చెన్నైలో ప్రదానం చేసింది. పాల్వంచలో స్థాపించిన అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్‌గా ఉన్న హరిబాబు తెలుగు రాష్ట్రాల్లో అందిస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల జిల్లా ప్రజలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఓ సాధారణ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువులు పూర్తి చేసుకొని సమాజంలో నిరుపేద విద్యార్థులకు సేవలు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విద్య, సామాజిక రంగాల్లో అందించిన సేవలకు తమిళనాడుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమి (ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ) గుర్తించి ప్రదానం చేసింది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఈ స్ఫూర్తితో రాబోయే రోజుల్లో సేవలు విస్తృతం చేస్తానని వెల్లడించారు.



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న తాళ్లూరి హరిబాబు

క్రైం సమాచారం

మట్టి లారీలు సీజ్

చర్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చర్ల మండలం శివలింగాపురం అటవీ శాఖ భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు లారీలు, ఒక ఎక్స్‌కవేటర్‌ను శనివారం చర్ల రేంజ్ అధికారులు పట్టుకున్నారు. చర్ల మండలం కుదునూరు, తేడగ గ్రామంలోని గిరిజనులకు ప్రభుత్వం ఇసుక రీచ్‌లను మంజూరు చేసింది. రోడ్ల నిర్మాణం కోసం మట్టిని తరలిస్తున్నారు. ఇదే క్రమంలో లారీలను అక్కడి గిరిజనులు అడ్డుకుని, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

డిప్లొమా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిప్లొమా పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందని సీపీసునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 ఉదయం 7గంటల నుంచి మే 3వ తేదీ సాయంత్రం 7గంటల వరకు ఈ సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో ఆ పరిసరాల్లో 200మీటర్ల వరకు ఐదుగురు మించి ఉండవద్దన్నారు. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైక్‌లు, డీజేలు, ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్, కాపీయింగ్ షాపులు మూసివేయాలని ఆదేశించారు.

స్క్రీన్ షేర్ చేసుకొని సైబర్ నేరం

వైరా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్ర్కీన్ షేర్ చేసుకొని నగదు స్వాహా చేసిన ఓ సైబర్ నేరగాడి ఉదంతమిది. మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన పత్తిపాటి శాంతయ్య ఈ సైబర్ నేరగాడి ఉచ్చులో చిక్కుకొని రూ.15వేలు పోగొట్టుకున్నాడు. శాంతయ్య తన ఫోన్‌పే మొబైల్ యాప్ పనిచేయకపోవడంతో ఫోన్‌పేలో చూపిన కస్టమర్ కేర్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. ఆ సమయంలో కస్టమర్ కేర్ అని మాట్లాడిన సైబర్ నేరగాడు వాట్సాప్‌లోకి రమ్మని వాట్సప్ స్ర్కీన్‌ను షేర్ తీసుకున్నాడు. అతర్వాత ఫోన్‌పేలో నగదు పరిశీలించమని శాంతయ్యకు నేరగాడు సూచించాడు. ఆతర్వాత బాధితుడు తన సెక్యూరిటీ పిన్ కొట్టి బ్యాలెన్స్ చెక్ చేశాడు. ఆసమయంలో స్ర్కీన్ షేరింగ్‌లో ఉన్న నేరగాడు శాంతయ్య ఫోన్‌పే పిన్ నెంబర్‌ను గమనించి బాధితుడి ఫోన్‌స్ర్కీన్‌ను బ్లాక్ చేసి రూ.15వేలు ఇతరులకు బదిలీ చేసి ఆవెంటనే స్ర్కీన్ షేర్ నుంచి తొలగిపోయాడు. ఆతర్వాత ఫోన్‌పే ఓకే అవ్వగా శాంతయ్య బ్యాలెన్స్ పరిశీలించుకున్నాడు. సదరు నేరగాడు రూ.15వేలు కాజేయడంతో జీరో బ్యాలెన్స్ కన్పించింది. శాంతయ్య వెంటనే సైబర్ క్రైమ్‌కు, వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం వెలుగుచూసింది. అదనపు ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరాయిగూడెం గ్రామానికి చెందిన కొనకళ్ల ఏసులక్ష్మి(40) భర్త కొంతకాలం క్రితం మృతిచెందాడు. కొద్దినెలలుగా ఏసులక్ష్మి హైదరాబాదులో నివాసం ఉంటూ కేర్ టేకర్‌గా పని చేస్తోంది. ఇదే తరుణంలో నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన రియాజ్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పరిచయం కాగా అతనితో సహజీవనం చేస్తోంది. ఈవిషయం ఇంట్లో కుటుంబసభ్యులకు తెలిసింది. ఏసులక్ష్మి పెదరాయిగూడెం రాగా కుటుంబసభ్యులు నిలదీయగా వాగ్వాదం జరిగింది. అనంతరం ఏసులక్ష్మి మండలంలోని బండారుగుంపులో నివాసం ఉండే తన మేనమామ ఇంటికి వచ్చింది. గొడవ వలన తన పరువు పోయిందని మనస్తాపం చెందిన లక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా శుక్రవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి వివరించారు.

తెగనమ్ముకుంటున్నారు..

- మిల్లర్ల పేచీలు, ప్రభుత్వ వైఫల్యంతో రైతుల ఆగచాట్లు
- డబ్బులు చెల్లించేందుకు ఇబ్బంది పెడుతున్న వ్యాపారులు
- దళారులకు బలవుతున్న అన్నదాత

వైరా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం రైతుల అగచాట్లు, అవసరాలను ఆసరా చేసుకొని ప్రైవేట్ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ ధాన్యాన్ని అయినకాడికి తెగనమ్ముకుంటున్నారు. పార్‌బాయిల్డ్ మిల్లర్ల పేచీలు, ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యంతో రైతులు నష్టపోతూ ప్రైవేట్ దళారులకు తమ ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకుంటున్నారు.

వైరా ప్రాంతంలో రబీ ధాన్యం కోతలు మొదలైన నాటి నుంచి ప్రతి నిత్యం ప్రకృతి ప్రకోపంతో రైతుల పరిస్థితి దినదినగండంగా తయారైంది. ఈ 15రోజుల వ్యవధిలోనే భారీ ఈదురు గాలులు, కుంభవృష్టి వర్షాలు కురిశాయి. ఈ సమయంలో రోడ్లు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఇదే అదునుగా భావించిన మిల్లర్లు ధాన్యంలో తరుగు కింద కటింగ్‌కు డిమాండ్ చేస్తున్నారు. తరుగు తీసేందుకు అంగీకరించకపోతే లారీల్లో వచ్చిన రైతుల ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా పేచీలు పెడుతూ తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కోసిన వరిధాన్యాన్ని వెంటనే దళారులకు రైతులు విక్రయిస్తున్నారు. 75కిలోల బస్తాకు రూ.1250నుంచి రూ.1300వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. రెండుకిలోల ధాన్యాన్ని తారం, గన్నీ సంచి కింద తీసేస్తున్నారు. డబ్బులు చెల్లించేందుకు 15రోజుల వాయిదా అయితే 75కిలోలకు రూ.1250, నెలరోజుల వాయిదా అయితే రూ.1270నుంచి రూ.1280, ఇంకా ఎక్కువ కాలం వాయిదా అయితే రూ.1300చెల్లించే విధంగా దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వెళ్తున్న ఆరబెట్టిన ధాన్యానికి తాలు, చెత్తాచెదారం సాకుతో పేచీలు పెడుతూ రైతులను ఇబ్బందిపెడుతున్న మిల్లర్లు దళారులు తీసుకువస్తున్న పచ్చిధాన్యాన్ని దిగుమతి చేసుకునే విషయంలో మాత్రం ఎలాంటి అభ్యంతరాలు పెట్టకపోవడం విశేషం. మిల్లర్లు రైతులను ఎంత ఇబ్బంది పెడితే అంతగా విసిగివేసారిపోయి దళారులకు తమ ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకునేలా మిల్లర్లు కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా విన్పిస్తున్నాయి. ప్రతిరోజూ పగలు తీవ్రమైన ఎండలు, సాయంత్రానికి గాలిదుమారంతో ఆకాశం మేఘావృతమై రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇంత జరుగుతున్నా మిల్లర్లు రైతుల ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకునేవిధంగా చర్యలు తీసుకోవడంలో ప్రభు త్వ యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లర్లు ఐదునుంచి పదికిలోల తరుగుకు డిమాండ్ చేస్తుండగా కొన్ని ప్రభుత్వ ఏజెన్సీలు నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ఒకరిద్దరు సిబ్బంది ఇదే అదునుగా భావించి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మిల్లర్ల కంటే ముందు కొనుగోలు కేంద్రంలోనే క్వింటా ఒక్కింటికి రెండుకిలోల చొప్పున తరుగు తీసి వేబిల్లు రాస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రకృతి సహకరించకపోవడం, ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించని ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



ధాన్యాన్ని లారీకి లోడ్ చేస్తున్న హమాలీలు



ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం

రెండు బార్లకు 145 దరఖాస్తులు

- చివరి రెండు రోజుల్లోనే 120మంది అశావాహులు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో రెండు బార్లకు దరఖాస్తుల స్వీకరణకు శనివారంతో తుది గడువు ముగిసింది. మొత్తం 145 దరఖాస్తులు ఎక్సైజ్‌శాఖ అధికారులకు అందాయి. కాగా చివరి రెండు రోజుల్లోనే 120 దరఖాస్తులు రావటం విశేషంగా మారింది. వచ్చిన దరఖాస్తులను ఎక్సైజ్‌శాఖ అధికారులు సీల్ చేసి భద్రపర్చారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి, ఈఎస్ నాగేంద్రరెడ్డి, సీఐ కృష్ణ దరఖాస్తులను పర్యవేక్షణ చేశారు. ఈనెల 29న లాటరీ విధానంలో రెండు బార్లకు ఎంపిక జరగనుంది.

550గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని కస్బాబజార్‌లో శనివారం వాహనతనిఖీలు చేపట్టగా ఎండు గంజాయితో పాటుగా నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లు వన్‌టౌన్ ఎక్సైజ్ సీఐ కృష్ణ ప్రకటించారు. తనిఖీలలో సీఐ కృష్ణతో పాటుగా ఎస్ఐలు సాయిబాబా, రేష్మ, సిబ్బంది రవి, అయ్యప్ప, స్టీఫెన్, హర్షద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ గంజాయి రవాణా, ఏ రూపంలో అయినా సేవించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఎవరైనా గంజాయి గురించిన సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం నగరంలోని మధురానగర్ రోడ్‌నెం. 10లో నివాసముంటున్న అన్నారపు తరుణ్(24) ఒక ఫైనాన్స్ కంపెనీలో ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కొద్ది రోజులుగా డబ్బుల విషయమై ఇంట్లో గొడవ జరుగుతున్న నేపథ్యంలో ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం మృతుని బంధువు రాజశేఖర్ వెళ్లి చూడగా మృతదేహం కనిపించింది. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు.



టీఎన్‌జీవో ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీని పరిశీలిస్తున్న టీజీ-ఈ జేఏసీ చైర్మన్, సెక్రటరీ

టీఎన్‌జీవో హౌసింగ్ సొసైటీ అభివృద్ధికి కృషి

- టీజేఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం టీఎన్‌జీవో హౌసింగ్ సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని టీజేఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని టీఎన్‌జీవో ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీలోని సమస్యలను నాయకులు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు హౌసింగ్ సొసైటీలో భవిష్యత్‌లో ఏర్పాటు చేయవలసిన మౌలిక వసతులు, పెండింగ్ తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదల ఆయువు ఎర్రజెండానే

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, కష్టజీవులకు ఆయువు ఎర్రజెండానే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి ఖమ్మం నగరానికి చెందిన వరద నర్సింహారావు సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముస్తాఫానగర్ నుంచి అల్లీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వరద నర్సింహారావును కూనంనేని సాంబశివరావు పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు భాగం హేమంతరావు, పోటు కళావతి, శింగు నర్సింహారావు, మహ్మద్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

వడదెబ్బతో మాజీ వార్డు సభ్యురాలి మృతి

భద్రాచలం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం గ్రామపంచాయతీ 13 వార్డు మాజీ సభ్యురాలు మడెం లక్ష్మి(58) వడదెబ్బతో మృతిచెందారు. కేసీఆర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల సమీపంలో ఒక రేకుల షెడ్‌లో లక్ష్మి నివాసముంటున్నారు. ఇటీవల ఊరువెళ్లి శుక్రవారం తన ఇంటికి వచ్చిన అనంతరం శనివారం సాయంత్రం వరకు తలుపులు తీయకపోవటం దుర్వాసన వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చింది. దీంతో వారు కిటికీలోంచి చూడగా మృతిచెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు. ఇలా ఉండగా మడెం లక్ష్మి కుమారుడు ఆరు నెలల క్రితం మృతిచెందగా మనస్థాపానికి గురైన ఆమె గత కొద్ది కాలంగా అనారోగ్యానికి గురైంది. గత రెండు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో వడదెబ్బ వలన మృతిచెంది ఉండవచ్చు అని స్థానికులు అంచనావేస్తున్నారు. కాగా తమ పార్టీకి చెందిన నాయకురాలు మృతి చెందిన విషయం తెలుసుకొని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు ఎంబి.నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు అక్కడికి చేరుకున్నారు. కాగా లక్ష్మి స్వగ్రామం ఏపీలోని కూనవరం మండలం పల్లూరు గ్రామం కావటంతో వారి బంధువులకు సమాచారం అందించారు.



మడెం లక్ష్మి





తలసీమియా రహిత సమాజం కోసం కృషిచేద్దాం

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): తలసీమియా రహిత సమాజం కోసం కృషిచేద్దామని ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఎస్‌బీ సీఐలు రాజిరెడ్డి, హనోక్ పిలుపునిచ్చారు. మేరిన ప్రపంచ తలసీమియా దినోత్సవం సందర్భంగా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని రితన్య ఆసుపత్రిలో సంకల్ప తలసీమియా డేకేర్‌సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చిన్నారులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తమ శాఖ ద్వారా చిన్నారులకు అవసరమైన సమయాల్లో రక్తదానం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పి.రవిచంద్ర, పి.పావని, పి.అనిత పాల్గొన్నారు.



బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి

- పోలీసు కమిషనర్ సునిల్‌దత్
- సెక్టార్ ఆఫీసర్లతో సమావేశం

ఖమ్మంక్రైం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): సెక్టార్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. శనివారం పోలీసు స్టేషన్ల పరిధిలోని సెక్టార్ ఇన్‌చార్జ్ పోలీసు అధికారులతో సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సెక్టార్ పోలీసింగ్‌ద్వారా నేరాలు అదుపుకోవడంతో పాటు మేమున్నామని ప్రజల్లో భరోసా కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ర్యాలీలు సదస్సులు నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి పథకాల కార్యక్రమాలపై ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా అధికారులు సహకారం అందించాలన్నారు ఆన్‌లైన్ మోసాలు,లోన్‌యాప్ కార్యకలాపాలపై నిఘా పెంచాలని, చిన్నచిన్న భూమి వివాదాలు పెద్ద సమస్యగా తలెత్తే అవకాశం ఉంటుందని, వాటిపై దృష్టి సారించాలన్నారు. రాత్రివేళలో గస్తీ పెంచాలని ఏటీఎంసెంటర్లు, బ్యాంకులను సందర్శించాలని, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తనిఖీలు ముమ్మరం చేయాలని సీపీ సునిల్‌దత్ ఆదేశించారు.ఈసమావేశంలో సీసీఆర్బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ స్వామి పాల్గొన్నారు.

కేఎంసీలో అధికారుల బంధుప్రీతి

- డీఎంసీ అల్లుడు, ఇంజనీరింగ్ అధికారి కుమారుడికి ఉద్యోగాలు
- మేయర్, కమిషనర్‌కు తెలియకుండానే నియామకాలు
- విచారణ చేపట్టిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మేయర్, కమిషనర్‌కు కనీస సమాచారం లేకుండానే నేరుగా ఉద్యోగాలు చేపట్టటం కేఎంసీలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు సైతం వారి బంధుప్రీతిని కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించి కేఎంసీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. జిల్లా మెప్మా అధికారి జిల్లా లోకల్ బాడీ కంట్రోల్ మేరకు కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయంలో బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. కొన్ని కారణాలతో ఆ అధికారికి కేఎంసీ కార్యాలయంలో చాంబర్‌లు కేటాయించారు. మెప్మా ఆధ్వర్యంలోనే ఉద్యోగ నియామకాలు చేసే వెసులుబాటు ఇవ్వటంతో.. సొంత అల్లుడికి కేఎంసీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఉద్యోగం కల్పించారు. రెండు రోజులుగా ఆయన విధులకు హాజరవుతున్నారు. ఖమ్మం నగరంలోని అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఓ అధికారి కీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కేఎంసీ కార్యాలయం నిర్వాహణ బాధ్యతలు సైతం అతని పరిధిలోనే ఉంటాయి. ఇంకేముంది కొడుకు ఖమ్మానికి దూరంగా ఉద్యోగం ఎందుకు చేయాలని భావించారు. ఏకంగా తనతో పాటే కార్యాలయంలో ఉద్యోగం కల్పించారు. కేఎంసీ కంట్రోల్ రూమ్‌లో ఉద్యోగంలో జాయిన్ చేయించాడు.

గుట్టు చప్పుడు కాకుండానే...

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎప్పటికప్పుడు అవసరాల మేరకు అదనపు నియామకాలు జరుగుతున్నాయి. అయితే బయటకు ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండానే అధికారులు గుట్టుగా నియామకాలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది కుటుంబ సభ్యులతో దరఖాస్తు చేయిస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు లేకుండా, బయటి వారికి తెలియకుండా అంతర్గతంగా ఉద్యోగ నియామకాలు చేస్తున్నారు.

మేయర్, కమిషనర్‌కు తెలియకుండానే...

ఖమ్మం నగర పాలక సంస్థలో ఏ దస్త్రం కదలాలన్నా కమిషనర్, మేయర్ సూచనలు, సలహాలు, ఆదేశాల మేరకు పనులు జరగాల్సి ఉంటుంది. కానీ కేఎంసీ కార్యాలయంలో మేనేజరు, సూపరింటెండెంట్ స్థాయిలో పర్యవేక్షణ అధికారి లేరు. దీంతో కేఎంసీ కార్యాలయంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఎవ్వరికి వారే నిర్ణయాలు తీసుకుంటూ ఏకంగా ఉద్యోగ నియామకాలు చేసే వరకు వెళ్లారు.

కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ

కేఎంసీలో ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా కంట్రోల్ రూమ్‌లో ఉద్యోగుల నియామకంపై ఆంధ్రజ్యోతి విలేకరి కమిషనర్ అభిషేక్ అగస్త్యను వివరణ కోరగా వెంటనే స్పందించారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా, ఇతర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టటంపై తీవ్రంగా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ అర్బన్ మండల అధ్యక్షుడు గుడిపూడి. శ్రీనివాసరావు, కార్యదర్శి బి. రవికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది. వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రంగారావు పాల్గొన్నారు.

బీఎల్ఐసీ తరగతులు ప్రారంభం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ కౌన్సిలింగ్ (బీఎల్ఐసీ) తరగతులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జకిరుల్లా శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నగరానికి కొత్త సీఐలు?

- ఒకట్రెండురోజుల్లో ఆర్డరు కాపీలు
- రెండు స్టేషన్లలో మారనున్న అధికారులు
- ఆగిన మరో ఇద్దరి స్థానచలనం



ఖమ్మంక్రైం,ఏప్రిల్26:(ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి కొత్తగా ఇద్దరు సీఐలు రానున్నట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్థానికంగా విధులు నిర్వహించిన అధికారులకు ఎన్నికల తర్వాత బదిలీలు సర్వసాధారణం.. కానీ ఖమ్మంలో ఎన్నికల తర్వాత బదిలీలు జరుగుతాయని ప్రచారం జరిగినప్పటికీ, ఎలాంటి బదిలీలు జరగలేదు. కేవలం ఎస్సై స్థాయి క్యాడర్‌లో మాత్రమే బదిలీలు జరిగాయి. కాగా ఇటీవల కాలంలో లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల అధికారులు మార్పు జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు పోలీసు అధికారులు పైరవీలు ప్రారంభించారు. తమకు దగ్గరగా ఉన్న రాజకీయ నేతల దగ్గరకు, తమకు అనుకూలంగా ఉన్న పలు ప్రజా సంఘాల నాయకుల వద్దకు తిరుగుతున్నారు. కాగా వారిలో కొందరికి బదిలీ జరగకుండా ఆపేందుకు, ప్రస్తుతం ఉన్న స్థానాల్లోనే కొనసాగేందుకు హామీ వచ్చినట్లు చెబుతున్నారు. కాగా మరికొందరు అధికారులకు మాత్రం స్థానచలనం తప్పదన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఇద్దరికి స్థానచలనం

అందులో నగరంలోని ఇద్దరు అధికారులకు తప్పనిసరిగా స్థానచలనం జరగనున్నట్లు తెలుస్తోందగా.. వారిస్థానంలో భద్రాద్రి జిల్లాకు చెందిన ఓ సీఐతోపాటు, నగరంలోని ఓ కీలక విభాగంలో పనిచేస్తోన్న మరో సీఐలకు హామీ లభించినట్లు సమాచారం. కాగా ఆయా అధికారులకు ఒకట్రెండు రోజుల్లో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆరోపణలు ఉన్నా

నగరంలో ఉన్న పోలీసు అధికారులపై గత కొంతకాలంగా పదుల కొద్దీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇంటిలిజెన్స్ విభాగం వారు కూడా విచారణ కూడా జరిపినట్లు సమాచారం. కానీ వారి బదిలీలు మాత్రం జరగడం లేదు. దీనిపై ఆ శాఖలోని కొందరు సిబ్బందే చర్చించుకుంటున్నారు. ఎప్పటికప్పుడు తమపై వచ్చిన ఆరోపణలను కప్పి పుచ్చుకోవడం.. ఆపై పైరవీలు చేసుకుని ఇక్కడే విధులు నిర్వహించడం వంటివి చేస్తున్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో సీఐలుగా విధులు నిర్వహిస్తూ సక్రమంగా విధులు నిర్వహించిన కొందరు అధికారులు సైతం లాఅండ్ ఆర్డర్‌లో పోస్టింగ్‌లు రాక ఇబ్బందులకు గురవుతున్నారు. కొంత మంది ఎక్కడ అయితే ఏముంది.. అంటూ విధులు కొనసాగిస్తున్నారు. ఏదిఏమైనా పోలీస్ శాఖలో మాత్రం పలుకుబడి ఉన్న వారికే పోస్టింగ్‌లు అని ప్రచారం జరుగుతుంది.

న్యాయాధికారి శాంతిలతకు వీడ్కోలు



న్యాయాధికారి శాంతిలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లాప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మంలీగల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): శనివారం బార్ అసోసియేషన్ హాల్లో బదిలీపై వెళ్తున్న మధ్యపాన ఆబ్కారీ ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి రాళ్లబండి శాంతిలతకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లాప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ, పదవీ విరమణ సహజం అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు శాంతిలత సేవలను కొనియాడారు.అనంతరం బదిలీ అయిన న్యాయాధికారిని బార్‌సభ్యులు సన్మానించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రెండో అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి మురళిమోహన్‌కు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం శాంతిలత మాట్లాడుతూ మొదటి పోస్టింగ్ అయిన ఖమ్మం.. తనకు చాలా అనుభవాన్ని ఇచ్చిందన్నారు. ఖమ్మం న్యాయస్థాన న్యాయవాదులను ఎప్పటికీ మర్చిపోను అని ఇంత ఘనంగా వీడ్కోలు ఏర్పాటు చేసిన బార్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కె.ఉమాదేవి, శీనయ్య, అర్చనకుమారి, అపర్ణ, ఎం.కల్పన, కాసరగడ్డ దీప, ఏపూరి బిందుప్రియ, శివరంజని, మాధవి, బిక్కం రజని, బి.నాగలక్ష్మి, బార్ అసోసియేషన్ బాధ్యులు గద్దల దిలీప్‌కుమార్, మోతుకూరి విజయశాంత, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనంతోనే ఉంటా..జనం కోసమే పని చేస్తా

- మంచి రోజులు వస్తాయి...
- పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ

నేలకొండపల్లి,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి):ఎన్ని ఇబ్బందులు ఎదురైనా జనంతోనే ఉంటానని, జనం కోసమే పని చేస్తానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. శనివారం నేలకొండపల్లి బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మనకు కూడా మంచి రోజులు వస్తాయని, కార్యకర్తలు భయపడాల్సిన పని లేదన్నారు. రజతోత్సవ సభ ఆరంభం మాత్రమేనని, మున్ముందు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మరిన్ని పోరాటాలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పదివేల మందిని తరలిస్తున్నామని చెప్పారు. సభకు వచ్చిన కార్యకర్తలు తిరిగి క్షేమంగా ఇంటికి వచ్చే వరకు నాయకులదే పూర్తి బాధ్యతన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేశామని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కందాళ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి, కొండపల్లి, రూరల్ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, బెల్లం వేణు,నాయకులు కోటి శ్రీనివాసరావు, నంబూరి సత్యనారాయణ, అనగాని నర్సింహారావు, షేక్.హుస్సేన్, గొలుసు రవి, వెన్నెబోయిన శ్రీను, గార్లపాటి నర్సింహారావు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

తిరుమలాయపాలెం: శనివారం మండలంలోని బచ్చోడు, రాజారం గ్రామాల్లో ఎమ్మెల్సీ తాతా మధు, కందాల పర్యటించారు. బచ్చోడులో ఏర్పాటుచేసిన తెలంగాణతల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న, బానోతు రవి, కొప్పుల ఉపేందర్‌రెడ్డి, బోడ మంచానాయక్, జక్కుల యాదగిరి, ఎ.రమణ పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి

నేలకొండపల్లి, ఖమ్మంలో కొవ్వొత్తులతో ర్యాలీ





నేలకొండపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నేలకొండపల్లి, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా శనివారంరాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ డౌన్‌డౌన్, ఉగ్రవాదులు నశించాలి, అమరులకు జోహర్లు అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కొవ్వొత్తుల ర్యాలీ పీఎస్‌ఆర్ సెంటర్ నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. తిరిగి పీఎస్‌ఆర్ సెంటర్‌కు చేరింది. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్,జెర్రిపోతుల అంజని, కుక్కల హనుమంతరావు, గెల్లా జగన్మోహన్‌రావు,షేక్.ఖాజామియా, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న పాల్గొన్నారు.

ఉగ్ర దాడిపై స్విమ్మర్ల నిరసన

ఖమ్మంస్పోర్ట్స్: ఉగ్రదాడిని స్విమ్మర్లు ఖండించారు. శనివారం నగరంలోని మున్నేరువద్ద నిరసన వ్యక్తం చేశారు. జాతీయ పతాకాలు, నల్లబ్యాడ్జిలు ధరించి దాడిని ఖండించారు. కార్యక్రమంలో లెఫ్ట్ కెనాల్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంగంటి వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, గోపాలపురం వెంకటాచారి, స్విమ్మర్లు వెగినాటి లక్ష్మయ్య, మండేపూడి సత్యనారాయణ, కొమ్ము విజయ్ చందర్, మంకెన శ్రీనివాసరావు, బారిశీను, డీపీఓ కోటయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, మట్టా వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.



జాతీయ పతాకాలు పట్టుకొని నినదిస్తున్న స్విమ్మర్లు

ఖమ్మం కలెక్టరేట్: కాశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి హేయనీయమని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దుగ్గినేని చలపతిరావు, జిల్లా బాధ్యులు డాక్టర్ జయప్రకాష్ అన్నారు. ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం ఖమ్మంలో డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ దండా నవీన్, కిషోర్‌గౌడ్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్ శ్రీరాం, సునీల్, ఓయాకిరణ్, చైతన్య, మధువర్మ, శ్రీలత, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ఎస్‌బీఐటీ' వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అప్పారావు, కృష్ణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డాక్టర్ అప్పారావు, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరై జ్యోతిప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కళాశాల సాధించిన ప్లేస్‌మెంట్స్, జాతీయస్థాయిలో కనబరిచిన ప్రతిభ అభినందనీయమన్నారు. భవిష్యత్ తరం కళాశాల నుంచే రూపుదిద్దుకుంటుందన్నారు. చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సెక్రటరీ, కరస్పాండెంట్ ధాత్రీ మాట్లాడుతూ అటనామస్ కలిగిన ఎస్‌బీఐటీలో విద్యార్థులకు అన్నివిధాలా తోడుంటుందన్నారు. ప్రథమ సంవత్సరం నుంచే ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్స్ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలి కన్నుమూత

తిరుమలాయపాలెం, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవాపురానికి చెందిన స్వాతంత్ర్య సమర యోదురాలు న్యూడెమోక్రసీ నాయకుడు ఉన్న వీరయ్య సతీమణి ఉన్న భారతమ్మ(86) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు ముగ్గురు కుమారులు సురేందర్, శ్రీనివాసరావు, రమేష్ ఉన్నారు.ఈప్రాంతంలో ఉన్నం వీరయ్య, భారతమ్మ ప్రజలకు ఏకష్టం వచ్చినా అండగా ఉండేవారు. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించేవారు. ఎన్డీ పార్టీ విస్తరణకు కృషి చేశారు. ఆమె భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రామసహాయం నరేష్‌రెడ్డి,గ్రానైట్ అసోసియేషన్ నాయకులు తుళ్లూరి కోటేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, గుర్రం అచ్చయ్య, యడ్లపల్లి నవీన్, రాయాల రాజా, తాతా రవీందర్, కొండబాల కరుణాకర్ నివాళులర్పించారు



దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

హమాలీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై వచ్చేనెల 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సీ వెంకటేష్, డీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకు అప్పగించిందని ఆరోపించారు. నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కే శ్రీనివాస్, భానోత్ రవి,బీ.రమేష్, కే.శ్రీను, తిరపయ్య, శోభన్, కృష్ణ పాల్గొన్నారు.

అద్దెభవనాల్లో గ్రామ పంచాయతీలు

- తిరుమలాయపాలెం మండలంలో అవస్థలు
- 40 పంచాయతీల్లో 20 పంచాయతీలకే భవనాలు
- సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు, చెల్లించలేక ఇబ్బందులు



అద్దెభవనంలో బాలాజీనగర్‌తండా కార్యాలయం

తిరుమలాయపాలెం,ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): మండలంలో సగం పంచాయతీ కార్యాలయాలకు భవనాలు లేవు.. ఫలితంగా అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజాప్రతినిధులు,ప్రజలు అవస్థ పడుతున్నారు. గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి మెరుగైన పాలన అందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. కానీ వాటికి సౌకర్యాలు కల్పించలేదు. దీంతో పక్కాభవనాలు లేకపోవడంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దెభవనాల్లో పంచాయతీల పాలన నడుస్తోంది.

మండలంలో 40 పంచాయతీలు

మండలంలో 40గ్రామపంచాయతీలున్నాయి. వాటిలో 20 పంచాయతీలకే భవనాలున్నాయి. మిగతా పంచాయతీల్లో భవనాలు లేకపోవడంతో అద్దెభవనాల్లో పనులు సాగిస్తున్నారు. దీంతో పాలన అస్తవ్యస్థంగా మారింది. మండలంలోని జోగులపాడు, బాలాజీనగర్‌తండా, మేకలతండా, మేకలబడతండా, ఏనకుంటతండా, పడమటితండా మరికొన్ని పంచాయతీలకు భవనాలులేవు. ప్రజలు కూడా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి.

అద్దెభవనాల్లో పాలన

తిరుమలాయపాలెం మండలంలో 20 పంచాయతీలకు శాశ్వత భవనాలు లేవు. దీంతో అద్దెభవనాల్లో అరకొర వసతులతో పాలన సాగిస్తున్నారు. కొత్తపంచాయతీల్లో సమావేశాలు నిర్వహించాలన్నా.. సరైన గదులులేక ఆరుబయటనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొన్ని భవనాల్లో వర్షం వస్తే కురిసే పరిస్థితి ఉంది. కార్యాలయ రికార్డులు, ఇతర సామగ్రి భద్రపరిచేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ జనాభాతో ఏర్పడిన కొత్త పంచాయతీలకు నిధులు కొరత వేధిస్తుంది. ఆర్థిక సంఘం నిధులను జనాభా ప్రాతిపదికన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తుండటంతో కష్టం తప్పడంలేదు. తక్కువ నిధులు మంజూరుకావడంతో సమస్యలు పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయింది. పన్నులు వసూలు అంతంతమాత్రంగా ఉండడంతో విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు.

పనులు సాగేనా..

- పునాదిదశలోనే నిలిచిన జనవరులశాఖ ఎస్‌ఈ భవనం
- రెండేళ్లు కావస్తున్నా పట్టించుకోని పాలకులు



కల్లూరులో పునాది స్థాయిలో నిలిచిన భవనం

కల్లూరు, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో జలనవరులశాఖ ఎస్‌ఈ కార్యాలయ భవనం నిర్మాణ పనులు పునాదిదశలోనే నిలిచిపోయాయి. నిర్మాణం చేపట్టి రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వ ఉన్నత అధికారుల నుంచి సాంకేతిక, ఆర్థిక ఇతరత్ర పరంగా అనుమతులు రాక పనులు నిలిచి పోయాయి. గత ప్రభుత్వంలో కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, సత్తుపల్లి, కల్లూరు, మధిర నియోజకవర్గాలకు కల్లూరును సమాంతర కేంద్రంగా గుర్తిం చి నాటి పాలకులు ఇక్కడకు ప్రాధాన్యత ని స్తూ సర్కిల్ కార్యాలయం మంజూరు చేశారు. ఇదే క్రమంలో ప్రభుత్వం కూడా సుమారు రూ.కోటి92లక్షల అంచనాతో నూతనంగా సర్కి ల్ కార్యాలయ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. 2023 ఏప్రిల్ నెలలో ఈ భవన నిర్మాణం పనులు ప్రారబించారు. ఇలా సుమారు 30 లక్షల వరకు అంచనాతో ఆ భవనం నిర్మాణానికి సంబంధించి పునాది స్థాయి వరకు పనులు చేశాడు. ఇక ప్రభుత్వం తరుపున నీటిపారుదల శాఖ ఉన్నత అధికారుల నుంచి అవసరమైన అనుమతులు రాక సదరు గుత్తేదారు ఆ భవనం పనులను అర్ధాంతరంగా నిలిపి వేశాడు. ఇలా రెండేళ్లగా పనులు నిలిచి పిచ్చిమొక్కలు దర్శనం నిస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వ పాలకులు ఈ భవన నిర్మాణంలో తగిన అనుమతులు అందేలా దృష్టి సారించక పోవడం గమనార్హం.



రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఎస్‌ఈ కార్యాలయం

కల్లూరులో కొనసాగుతున్న జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయం పాలన అంత ప్రస్తుతం పాత రేకుల షెడ్డులో కొనసాగుతుంది. కల్లూరు సర్కిల్ కార్యాలయం పరిధిలో కల్లూరు, సత్తుపల్లి, మధిర డివిజన్లు విస్తరించి ఉన్నాయి. ఇక్కడ షెడ్డులో సరియైన వసతి లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టికి తీసుకోపోవడంలో నిర్లక్ష వైఖరి అవలంబిస్తున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు స్పందించి కల్లూరులో జనలవరులశాఖ సర్కిల్ కార్యాలయ ప్రాధాన్యతను గుర్తించి అసంపూర్తిగా నిలిచిన నూతన భవనం నిర్మాణం పనులను పునరుద్ధరించేలా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు అందిస్తాం



కొణిజర్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇండ్లు వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. శనివారం కొణిజర్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సారూ మా ఇల్లు చూడండి ఇల్లు ఇస్తే కట్టుకుంటా అంటూ ఎమ్మెల్యేకు నిరుపేద మహిళ లక్ష్మి తన రేకుల ఇంటిని చూపిస్తూ ఇంటికోసం వేడుకుంది. దాంతో ఎమ్మెల్యే చలించిపోయి మీ మీలాంటి పేదల కోసమే ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిందని, పేదలకు అండగా నిలుస్తామని తెలిపారు. మండలాధ్యక్షుడు వడ్డే నారాయణరావును పిలిచి అన్న ఇటువంటి పేదలకు మనం ఇల్లు ఇవ్వాలి, ఆమెకు ఇల్లు ఇవ్వండి అంటూ నీకు ఇల్లు వస్తుందని ఆమెకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అలాగే గ్రామంలోని రేకులలో, గుడిసెల్లో ఉంటున్న లబ్ధిదారుల ఇండ్లను మాజీ సర్పంచ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు సూరంపల్లి రామారావుతో కలిసి పరిశీలించారు. గ్రామ సమస్యలను ఎమ్మెల్యే రామారావును అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోసూరి శ్రీనివాసరావు, మోష, గన్ను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వ నిర్మాణం కోసం భూసేకరణ



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్

బోనకల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బోనకల్ ఉన్నత పాఠశాల సమీపంలో రైల్వే ట్రాక్ పక్కనున్న పొలంలో మూడో రైల్వే లైన్ వరద కాల్వ నిర్మాణం కోసం భూసేకరణకు సంబంధించి శనివారం తహసీల్దార్ పున్నం చందర్, రైల్వే శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంత్‌లు భూమిని పరిశీలించారు. గ్రామానికి చెందిన నిమ్మగడ్డ పుల్లారావు అనే రైతుకు చెందిన పొలం అక్కడ ఉండటంతో 18.5 కుంటల భూమి అవసరమవుతుందని గుర్తించారు. భూయజమానితో వారు సంప్రదింపులు జరిపారు. ఇట్టి ప్రతిపాదనలను జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారికి పంపించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ మైథిలీ, సర్వేయర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



శ్రామికుడికి గొడుగు అందిస్తున్న సుధారాణి

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): దినసరి శ్రామికులకు సుధాహెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఐదు గొడుగులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, డాక్టర్ కొనకళ్ల సుధారాణి మాట్లాడుతూ సైకిళ్లపై, రోడ్డు పక్కన పళ్లు అమ్ముకునే పేదవారు, ఎండలో ఇస్త్రీబండి వేసుకునేవారు, కొబ్బరి బొండాలను అమ్మేవారికి ఆసరాగా గొడుగులను అందించినట్లు తెలిపారు. వారికి చేదోడుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సుదారాణికి దినసరి శ్రామికులు కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ

వైరా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం ఉచిత మెగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. స్థానిక యువకుడు ప్రవీణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



విద్యార్థి గౌతమిని సన్మానిస్తున్న నాయకులు

బోనకల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు గౌతమికి శనివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు, అతని సోదరుడు హర్షిక ఆగ్రోస్ ఏజన్సీ యజమాని తోట నాగకృష్ణలు రూ.10వేలను వితరణగా అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులో ప్రతిభ చాటిన పేద విద్యార్థినికి తమవంతుగా చేయూతనందించామని తెలిపారు. గౌతమి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని గౌతమిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కాటమయ్య జాతర

ముదిగొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కాటమయ్య జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు జలబిందెలతో కాటమయ్య ఆలయ వరకు ప్రదర్శన నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈజాతరలో యువతీ యువకులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు.



నృత్యం చేస్తున్న యువకులు

భూముల భద్రత కోసమే భూ భారతి చట్టం

- ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): రైతుల భూములు భద్రత కోసమే నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. శనివారం కొణిజర్లలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ చట్టం గురించి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీవో నరసింహరావు రైతులకు వివరించారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుభవదారులకాలం తొలగించి చిన్న రైతుల పోలాలను ఆసాములకు అప్పగించిందని, ఆ భూములను భూ భారతి ద్వారా సరి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మంజిల్లాలో సుమారు లక్షకు పైగా సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీరికి పట్టాలు అందించేందుకు భూ భారతి చట్టంలో సౌలభ్యం కల్పించామని వివరించారు.

ధాన్యం కొనుగోలు చేయాలని వినతి

ధాన్యంను కాంటాలు చేసి వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ మండలంలోని మల్లుపల్లి రైతులు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను కోరారు. తమ గ్రామంలో మూడు కొనుగోలు కేంద్రాలు ఉండి కూడా ధాన్యాన్ని కాంటాలు చేయడంలేదని, కారణం లారీలలో ఉన్న దిగుమతి కావడంలేదని తెలుపుతున్నారని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహరావు, తహసీల్దార్ రాము, ఎంపీడీవో రోజారాణి, వ్యవసాయశాఖ ఏడీఏ కరుణశ్రీ, ఏవో బాలాజీ, ఆర్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: భూ హక్కులపై భద్రతకల్పించేలా భూ భారతి చట్టం రూపకల్పన చేశామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆర్డీవో నర్సింహరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్, ఏవో బట్టు అశోక్ కుమార్, ఎంపీవో రవీంద్రప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

బోనకల్‌లో బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం

బోనకల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 30నుంచి వచ్చేనెల 31వతేదీ వరకు బాల్‌బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు కోచ్ అమరేని లింగయ్య తెలిపారు. బోనకల్‌లో శనివారం వేసవి శిక్షణ శిబిరానికి సంబంధించి ఏర్పాట్లను సీనియర్ క్రీడాకారులతో కలిసి ఆయన పూర్తి చేశారు. నెలరోజుల పాటు జరిగే శిక్షణ శిబిరానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైడిపల్లి కిషోర్‌కుమార్ 10మంది క్రీడాకారులకు బ్యాట్లు, మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ 24బంతులు వితరణగా అందజేయడం అభినందనీయమన్నారు. నెలరోజుల పాటు కొనసాగే వేసవి శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శిక్షణ శిబిరంలో కోచ్ లింగయ్య

ఫొటోగ్రాఫర్లంతా ఐక్యంగా ఉండాలి



ఫొటోగ్రాఫర్ల డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించుకునేందుకు ఫొటోగ్రాఫర్లంతా ఐక్యంగా ఉండాలని ఫొటోగ్రాఫర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నం కనకారావు అన్నారు. శనివారం కొణిజర్లలో ఫొటోగ్రాఫర్ల వివరాల డైరీని ఆయన ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు ఇజ్జగాని రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుమలరావు, రాము, వసంతరావు, సైదులు, మండల బాధ్యులు నాగేశ్వరరావు, సతీష్, మధు, అప్పారావు, రమేష్, చారి, హరి, నాగేశ్వరరావు, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణతో పేదలకు లబ్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న నెల్లూరి కోటేశ్వరరావు

వైరా, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ వలన పేదలకు లబ్ధి చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం వైరాలో నిర్వహించిన వక్ఫ్ చట్ట సవరణ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ చట్ట సవరణపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆక్షేపించారు. అన్ని వర్గాల ప్రజలు ఈ వక్ఫ్ చట్ట సవరణకు మద్దతునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, వాకదాని పుల్లారావు యాదవ్, ఈవీ.రమేష్, శ్యామ్‌రాథోడ్, వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న గిరిబాబు

ఏన్కూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు అన్నారు. వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ బహిరంగసభ విజయవంతం చేయాలని కోరుతూ శనివారం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో పార్టీనాయకుల పొన్నం హరికృష్ణ, భూక్యా ధర్మ, భూక్యా వినోద్‌కుమార్, ఎస్‌కే బాజీ, చాంద్‌పాషా, దావీద్ తదితరులున్నారు.

మధిరరూరల్‌లో...

మధిరరూరల్: వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవం సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మధిరలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ద్విచక్రవాహనర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆధ్వర్యంలో ఈర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా లింగాల మాట్లాడుతూ వరంగల్‌సభకు కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు ఈకార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, అరిగే శ్రీను, వైవీ అప్పారావు, బొగ్గుల భాస్కరరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ సత్తుపల్లిలో బంద్



సత్తుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన దారుణ మారణకాండకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సత్తుపల్లిలో చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. వ్యాపారాలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేశారు. మద్దతుగా నిలిచిన వస్త్ర, వ్యాపార, వాణిజ్య సముదాయాలకు బీజేపీ నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈవీ.రమేష్‌లు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుల్లారావు, ప్రభాకర్, రాంబాబు, కృష్ణయ్య, శ్రీను, శివకృష్ణ, వసంతరావు, నరేష్, శివ, అశోక్, శేషగిరి, నాగస్వామి, సుబ్రహ్మణ్యం, కార్తీక్, రాము, చందు తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్: కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైన చర్య అని ఎన్పీడిసిఎల్ మధిర ఏడీఈ అనురాధ అన్నారు. శనివారం మధిర లోని సబ్ డివిజన్ కార్యాలయంలో పెహల్గాంలో మృతి చెందిన యాత్రికులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు మైథిలి, గణేష్ సిబ్బంది పాల్గొన్నారు.



మధిరటౌన్‌లో నివాళులర్పిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏన్కూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ఎస్సీకాలనీ, బురదరాఘవాపురం గ్రామంలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు అంధ్రజ్యోతిలో ప్రచురితమైనకథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. శుక్రవారం సాయంత్రం విద్యుత్‌శాఖ అధికారులు బురదరాఘవాపురంలో ప్రమాదకరంగా కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను సందర్శించి, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు. ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయించారు. ఏన్కూరు ఎస్సీ కాలనీలోని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం అలానే వదిలేశారు.

హామీలు అమలు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఏన్కూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆపార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ సీపీఎం పార్టీ నిర్వహించిన ఇంటింటి సర్వేలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి దొంతెబోయిన నాగేశ్వరరావు, బానోతు బాలాజీ, ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, స్వర్ణ కృష్ణారావు, కాలసాని సాయి, కోటేశ్వరరావు, గుడ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మకర తోరణం వితరణ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాతలు రూ.55వేల విలువైన మకర తోరణాన్ని శనివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు ఇమ్మడి రంగారావు, ఆయన కుమారుడు ప్రసాద్‌లను ఆలయ కమిటీ సభ్యులు చల్లగుళ్ల శ్రీనివాసరావు, దోసపాటి ప్రసాద్ ఘనంగా సన్మానించారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వేంసూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేంసూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1984-85వ సంవత్సరం పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. గత 40ఏళ్ల క్రితం ఈ పాఠశాలలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులంతా ఒకచోట కలుసుకొని తమ చిన్ననాటి తీపిజ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాటలు, నృత్యాలతో అలరించారు. అపూర్వ సమ్మేళన నిర్వహణకు కృషిచేసిన కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ డీఎస్పీ నాయుడు మల్లయ్యస్వామి, రైల్వే ఏడీ తక్కెళ్లపాటి, సూర్యనారాయణ, అరవిందో ఫార్మసీ వైస్‌ప్రెసిడెంట్ నాగులవంచ శ్రీనివాసరావు, వెంకటేశ్వర గార్డెన్ రి యల్‌ఎస్టేట్ సీనియర్ డైరెక్టర్ రంగు రామారావు, న్యూలైఫ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సాలి భాస్కర్, పావులూరి సురేష్, కళావతి, రాధికలను సన్మానించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు విఠల్‌రావు



పెనుబల్లిలో మాట్లాడుతున్న విఠల్‌రావు

పెనుబల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు పిలుపునిచ్చారు. వీఎంబంజర్ సెంటర్లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మిద్దే స్వామి, అన్నపురెడ్డి లక్ష్మయ్య, గుజ్జా వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ సంఘ నాయకులు కొప్పుల గోవిందరావు, శ్రీనివాసరావు, మాధవరావు, సుధాకర్, చందు, నాగరాజు, ఫ్రూట్స్ యూనియన్ నాయకులు రమేష్, మల్లెల నర్సింహారావు, మెకానిక్ యూనియన్ నాయకులు యూసఫ్, చారి పాల్గొన్నారు.

తల్లాడ, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): కార్మికవర్గాన్ని బానిసత్వానికి గురిచేసి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేడేను జరపాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి డి. శ్రీనివాసరావు కోరారు. తల్లాడలో శనివారం మేడే ప్రచార పోస్టర్‌ను ఆ విష్కరించారు. ఈకార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు షేక్ లాల్ మియా, తల్లాడ ఏరియా కమిటీ అధ్యక్షుడు పటాన్ నాగుల్ మీరా, నాయకులు జి.వెంకటేశ్వర్లు, కిషోర్, నాగయ్య, సురేష్, రామకృష్ణ, వెంకటి, నాగేశ్వరరావు, సతీష్ పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపు నిస్తూ శనివారం గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్‌రావు, స్వరూప, కోటేశ్వరి, జాన్‌బి, ప్రమోదు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు